

## నేటి నుంచి ఏజెన్సీలో బస్సుల పునరుద్ధరణ

**ప్రజాశక్తి -సీలేరు:** మొంథా తుఫాన్ కారణంగా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలో నడిపే బస్ సర్వీసులను రద్దు చేయాలని ఆర్టీసీ అధికారులకి ఆదేశించిన సంగతి తెలిసిందే. విశాఖపట్నం డిపో చెందిన విశాఖ వయా నర్సీపట్నం చింతపల్లి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సు, సీలేరు నైట్ హాల్ట్ పగటిపూట తిరిగే విశాఖ వయా సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే బస్సు సర్వీస్ రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు గురయ్యారు. తుఫాను తగ్గుముఖం పట్టిందని శనివారం నుంచి బస్ సర్వీసులను యధాతథంగా పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు విశాఖపట్నం డిపో మేనేజర్ మాధురి స్పందించారు. పగలు రాత్రి నడిచే బస్ సర్వీసులు శనివారం నుంచి యధాతథంగా తిరుగుతాయని ప్రకటించారు.

### గిరిజన నాయకులపై క్రిమినల్ కేసులు పెడతామన్న

# కలెక్టర్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

### ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ బాధితుల సంఘం, గిరిజన సంఘం నేతల డిమాండ్



రహస్య సర్వే పత్రాలు చూపుతున్న గిరిజనులు, చిన్నయ్య పడాల్

**ప్రజాశక్తి-చింతపల్లి :** హైడ్రో పవర్ ప్రాజెక్ట్, పంప్ స్టోరేజ్‌లపై ఉద్యమాలు చేస్తున్న గిరిజన నాయకులపై క్రిమినల్ కేసులు పెడతామని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ బాధితుల సంఘం కన్వీనర్ బోనంగి చిన్నయ్య పడాల్, కో-కన్వీనర్ వెంకటేశ్వర్లు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. ఎర్రబొమ్మల పంచాయతీ, ఏర్నాపల్లి గ్రామంలో ప్రాజెక్ట్ బాధిత గిరిజనులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ ఈ నెల 27న జిల్లా కేంద్రంలో హైడ్రో పవర్ ప్రాజెక్టులపై నిపుణుల కమిటీతో జరిగిన సమావేశంలో కలెక్టర్ చేసిన వ్యాఖ్యలు గిరిజనుల మనోభావాలను దెబ్బతీశాయని పేర్కొన్నారు. పోరాటాలు చేస్తున్న నాయకులపై కేసులు పెడతామని ఎస్పీ సమక్షంలోనే కలెక్టర్ చెప్పడం అత్యంత అనుచితమన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో 1/70 భూ బదలాయింపు చట్టం ఉన్నప్పటికీ ఇక్కడి భూములు ప్రైవేట్ కంపెనీలకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదాని, నవయుగ, షిరిడి సాయి ఎలక్ట్రికల్ ప్రైవేట్ కంపెనీలకు అనుమతులిస్తూ జారీ చేసిన జిఒలను తక్షణమే రద్దు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా ప్రాజెక్టులు, డ్యాములు పేరుతో గిరిజనులు తమ భూములను కోల్పోయి వలసలు వెళ్లిపోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. గతంలో ఉన్న కలెక్టర్లు గిరిజనుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలు చూపారని, ప్రస్తుత కలెక్టర్ కూడా అదే సానుభూతితో వ్యవహరించాలని కోరారు. రాజకీయ పార్టీలకు అతీతంగా గిరిజనులు ఐక్యంగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎర్రబొమ్మలు సర్పంచ్ లోత పండయ్య, ఉపసర్పంచ్ సెగ్గే సోమరాజు, తంబీలి బాబురావు, పాంగి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి:** పోరాటాల ద్వారానే కార్మికుల సమస్యల పరిష్కారం అవుతాయని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి నిర్మల, పి. రామరాజు అన్నారు. శుక్రవారం స్థానిక బిల్డింగ్ వర్కర్స్ సమావేశ మందిరంలో సిఐటియు మండల సమావేశం రామరాజు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూఎ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్లకు తలొగ్గి కార్మికుల ఎనిమిది గంటల పని స్థానంలో 10 గంటలుగా మార్పు చేసి కార్మికుల హక్కులను హరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ అడుగుజాడల్లో రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల చట్టాల్లో తెచ్చిన సవరణలు తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలని ప్రభుత్వం పూనుకుందని ఈ చర్యలు తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి ఆశ మధ్యాహ్నం భోజనం, 108,104,ఆరోగ్య మిత్ర, విఒఎలకు కనీస వేతనాలు,పెన్షన్ రిటైర్మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి వారి సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు, అంగన్వాడి, ఆశ, విఒఎ, భవన నిర్మాణ రంగ నాయకులు రాంబాబు,కె వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకట్



బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

## తుపాను బాధితులకు సర్పంచ్ సహాయం

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి:** మండలంలోని దూసరపాములో వరద బాధితులకు సర్పంచ్ చీడి శివ, వార్డు సభ్యులు, గ్రామస్తులు, వైసిపి నేతలు శుక్రవారం సహాయం అందజేశారు. ఎస్టీ పేటలో 3 ఇళ్ళు నీటమునగడంతో సర్పంచ్ శివ 3 కుటుంబాలకు భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు కొంత ఆర్థిక సహాయం చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ శివ కోరారు.

## రాజేంద్రపాలెం పీసా కమిటీ ఉపాధ్యక్ష ఎన్నిక పూర్తి

**ప్రజాశక్తి-కొయ్యూరు:** కొయ్యూరు మండలంలోని రాజేంద్రపాలెం పంచాయతీ పిసా కమిటీ ఉపాధ్యక్ష ఎన్నిక ఎట్టకేలకు పూర్తయింది. పలుమార్లు వాయిదా పడుతూ వస్తున్న ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. కమిటీ ఉపాధ్యక్షుడుగా గంగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎంపిడిఒ ప్రసాదరావు తెలిపారు. ఎన్నికల అధికారి ఏఎస్ఒ కే.చైతన్య ఆధ్వర్యంలో సర్పంచ్ సింహాచలం, కార్యదర్శి మోనిక సారథ్యంలో ఎన్నిక ప్రశాంతంగా జరిగిందన్నారు.

## కల్వర్టు పనులు ప్రారంభం

**ప్రజాశక్తి -కూనవరం :** పంచాయతీ పరిధిలో సర్పంచ్ బొగ్గా వెంకమ్మ ఆధ్వర్యంలో కల్వర్ట్ పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో కాలంగా గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని కల్వర్ట్ నిర్మాణంతో సమస్య తొలగుతుందన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ అనిత, వార్డ్ మెంబర్ సోడె నాగేశ్వరావు, పాయం సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

## కొత్త జిల్లా ఏర్పాటుతోనే నిర్వాసితుల సమస్య పరిష్కారం

**ప్రజాశక్తి- విఆర్.పురం:** పోలవరం నిర్వాసితుల సమస్యలు త్వరగా పరిష్కారం కావాలంటే రంపచోడవరం కేంద్రంగా నూతన జిల్లాను ఏర్పాటు చేయాలని విఆర్ పురం సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం చొక్కనపల్లిలో సున్నం సీతమ్మ అధ్యక్షతన జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా కేంద్రం పాడేరు ప్రజలకు అందుబాటులో లేదని జిల్లా అధికారులను కలిసి తమ సమస్యలను నేరుగా చెప్పుకొనే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రంపచోడవరంలోని 11 మండలాలు, ఏలూరులోని 4 మండలాలు, నాన్ షెడ్యూల్ ప్రాంతంలోని గిరిజన గ్రామాలను కలుపుతూ రంపచోడవరం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేయడం వల్ల జిల్లా అధికారులం దరూ అందుబాటులో ఉంటారన్నారు. సమావేశంలో మండల నాయకులు తోడం రాజు, గొర్రె రాజు పాల్గొన్నారు.




అడ్డతీగల: జెండాను ఎగురవేస్తున్న ఎఐటియుసి అధ్యక్షులు రాజబాబు

## పలుచోట్ల ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవం

**ప్రజాశక్తి- అడ్డతీగల:** స్థానిక మండల కేంద్రంలోని జిసిసి గోదాము వద్ద ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జెండాను యూనియన్ అధ్యక్షులు రాజబాబు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ కార్మికులకు సమ్మె చేసే హక్కు, పని గంటలు, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కును హరించేందుకు ప్రయత్నిస్తోందని దీన్ని పోరాటాల ద్వారానే తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో అడ్డతీగల గోడౌన్ హమాలీలు పాల్గొన్నారు.

**జి.మాడుగుల:** స్థానిక జిసిసి గోడౌన్ వద్ద హమాలీలు, కార్మికులు ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జెండాను ఎగరవేశారు. ఏఐటియుసి జిల్లా నాయకులు పండు బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం తమను గుర్తించి కనీస వేతనాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిసిసి హమాలీలు సిబ్బంది పాల్గొన్నారు



వాటర్ ఫిల్టర్స్ అందిస్తున్న కృపారావు

## కృపా భారతి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు సహకారం

**ప్రజాశక్తి - విఆర్‌పురం:** అల్లూరి సీతారామరాజు జిల్లా వి ఆర్ పురం మండలం బి సి కాలనిలో కృపా భారతి చారిటబుల్ ట్రస్టు ద్వారా శుక్రవారం పేద ప్రజలకు ఉచితంగా వాటర్ ఫిల్టర్స్ పంపిణీ చేశారు. మొత్తం 60 కుటుంబాలకు అందించినట్టు ట్రస్ట్ చెర్మన్, పాస్టర్ రెవరెండ్ కె కృపారావు తెలిపారు. ఈ సందర్భంగా కృపాభారతి చారిటబుల్ ట్రస్ట్ చెర్మెన్ కపారావును అభినందించారు.

## కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### - ఎపిఎఫ్‌డిసి డిఎంకు వినతి



వినతిపత్రాన్ని ఇస్తున్న నేతలు, కార్మికులు

**ప్రజాశక్తి-పాడేరు:** కాఫీ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కాఫీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు లింగేరి సుందరరావు ఏపీ ఎఫ్‌డిసి యాజమాన్యాన్ని కోరారు. కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ శుక్రవారం ఏపీఎఫ్‌డిసి డివిజనల్ మేనేజర్ జి. కృష్ణబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాఫీ కార్మికుల సమస్యలపై 2024లో జరిగిన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రధానంగా కాఫీ అంతర్జాతీయంగా గుర్తింపు పొందినప్పటికీ కార్మికులకు పెరుగుతున్న ధరలకు కనుగుణంగా రోజువారి వేతనాలు పెంచకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలలో పెరగవలసిన రోజువారి కూలి రేట్లు పెంచలేదన్నారు. సంస్థలో వివిధ స్థాయిలో సిబ్బంది నియామకం చేపట్టక పోవడంతో కింద స్థాయి ఉద్యోగులపై పని భారం పెరిగి ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. ఇప్పటికి పని చేస్తున్నటువంటి హెల్పర్స్‌ను ప్లాంటేషన్ కండక్టర్స్ గా నియామకం చేపట్టాలని కోరారు. హెల్పర్స్‌కు కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని, ఇతర సమస్యలు పరిస్కారం చెయ్యాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మె చేపడతామని ఇదివరకే తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కన్ననాద్, చిన్నలమ్మ, దేవి, అప్పలమ్మ, పుష్పరాణి, పద్మ, మణి, లక్ష్మి, కాంతమణి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిందితునికి పదేళ్ల జైలు

**ప్రజాశక్తి -అనంతగిరి:** గంజాయి రవాణా నిందితుడికి పదేళ్ళ కారాగార శిక్ష విదిస్తూ చోడవరం అదనపు 9వ కోర్టు జడ్జి తీర్పు జారీ చేసినట్లు అరకు సర్కిల్ సిఐ ఎల్.హిమగిరిరావు, స్థానిక ఎస్సై. శ్రీనివాసరావు శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2020 సంవత్సరంలో అరకు ప్రాంతం నుండి విశాఖ మైదాన ప్రాంతంకు లారీలో సుమారు 620 కేజీల గంజాయి తరలిస్తూ ఉండగా అప్పటి పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. నిందితుడు ఉత్తరప్రదేశ్ ఫుజియాబాద్ రాష్ట్రం అట్టుట గ్రామానికి చెందిన రాజు అనే లారీ డ్రైవర్ కు పదేళ్ళ శిక్షతోపాటు లక్ష రూపాయలు జరిమాన విద్దిస్తూ చోడవరం 9వ అదనపు జిల్లా జడ్జి ఎం హరి నారాయణ తీర్పు వెల్లడించారని తెలిపారు. లక్ష రూపాయల జరిమాన చెల్లించకపోతే ఒక సంవత్సరం అదనపు శిక్ష పెరుగుతుందని స్పష్టం చేసినట్లు తెలిపారు.

# గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి

### - ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ



**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** పాడేరు ఐటిడిఎకు న్యూఢిల్లీలో రాష్ట్రపతి బెస్ట్ అవార్డును అక్టోబర్ 17న అందజేసినట్లు ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ తెలిపారు. శుక్రవారం ఐటిడిఎలోని తన చాంబర్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పిఒ మాట్లాడారు. గిరిజనాభివృద్ధికి తోడ్పడాలని, గిరిజన ప్రాంతాల్లో సమర్థవంతమైన పాలన అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ఆది కర్మ యోగి అభియాన్ పథకాల ద్వారా ఏజెన్సీలో గిరిజన గ్రామాల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాల్లో ప్రతిభ ఆధారంగా ఐటిడిఎ స్థాయిలో పాడేరు ఐటిడిఎ పనితీరుకు అవార్డు లభించిందని వివరించారు. 2030 నాటికి గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడం ఈ స్కీం లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామస్థాయి కార్యాచరణ ప్రణాళిక సెప్టెంబర్ 2 నుంచి 15 వరకు నిర్వహించి, అక్టోబర్ 3న నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలు, తీర్మానాలు అప్‌లోడ్ చేసినట్లుగా తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు వివిధ అంశాలలో రూ.1624.61 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు వివరించారు.బిర్సా ముండా జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 1 నుండి 15 వరకు జరగనున్న జాన్ జాతీయ గౌరవ్ దివాస్ మహోత్సవాలకు గిరిజనులందరూ పాల్గొవాలన్నారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఐటిడిఎ నుంచి కాఫీ హౌస్ వరకు కార్నివాల్ జరుగు తుందని, గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిభంభించేలా వివిధ సంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అనంతరం కాఫీ హౌస్ లో మొక్కలు నాటే కార్యక్రమం, బిర్సా ముండా చిత్రపటానికి, గిరిజన స్వతంత్ర సమరయోధులకు పూలమాలతో నివాళులు అర్పిస్తామని తెలిపారు. స్వాతంత్ర గిరిజన సమరయోధులు, సమస్యలపై పోరాడే గిరిజన సంఘసంస్కర్తలు ఎవరైతే గుర్తించకుండా వెనకబడి ఉన్నారో, వారందరినీ పురస్కరించుకుని భవిష్యత్తు తరాలకు తెలియజేసే విధంగా ఈ జాన్ జాతీయ గౌరవ్ దివాస్ కార్యక్రమం నిర్వహించబడు తుందన్నారు. ట్రైబల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌తో కలిసి గిరిజనుల సాంస్కృతిక కళలు, వేషధారణ, తదితర అంశాలను డాక్యుమెంటరీ చేస్తున్నామన్నారు. వివిధ రంగాలలో నైపుణ్యం కలిగిన గిరిజనులు ముందుకొచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొవాలన్నారు. వారి కళను ముందుకు తీసుకుని వెళ్లే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

## సోమ కుమారుడు సురేష్ కుమార్‌కు డిప్యూటీ తహశీల్దార్ ఉద్యోగం



**ప్రజాశక్తి-అరకులోయ :** మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుమారుడు సురేష్ కుమార్‌కు కారుణ్య నియామకం కింద డిప్యూటీ తహశీల్దార్ ప్రభుత్వ ఉద్యోగం ఎట్టకేలకు వరించింది. 2018 సెప్టెంబర్ 23న డుంబ్రిగూడ మండలం లివిటిపూటు వద్ద జరిగిన నక్సల్స్ కాల్పుల్లో అప్పటి అరకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కిడారి సర్వేశ్వం రావుతో పాటు, మాజీ ఎమ్మెల్యే, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి సోమ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమా కుటుంబాలను పరామర్శించడానికి స్వయంగా అప్పటి సీఎంగా ఉన్న చంద్రబాబు అరకులోయ వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్వేశ్వరరావు సోమ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే సర్వేశ్వరరావు చిన్న కుమారుడికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇచ్చి పెద్ద కుమారుడు కిడారి శ్రావణ్ కుమార్ కు మంత్రి పదవి ఇచ్చారు. సోమ పెద్ద కుమారుడు సివేరి అబ్రహంకు ఎస్సీ ఎస్టీ కమిషన్ పదవిని ఇచ్చారు. సోమ రెండవ కుమారుడికి ఉద్యోగం ఇవ్వడంలో జాప్యం జరిగింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా ఈయనకు ఉద్యోగం ఇవ్వలేదు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే సోమ కుమారుడు సివేరి సురేష్ కుమార్‌కు కారుణ్య నియామకం కింద డిప్యూటీ తహసిల్దార్ గా ఉద్యోగం ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని సోమ కుమారుడు సురేష్ కుమార్ తెలిపారు. తనకు ఉద్యోగం ఇచ్చి తన కుటుంబాన్ని ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, కూటమి ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## కుంగిన కల్వర్టును పరిశీలించిన నాయకులు

**ప్రజాశక్తి-చింతపల్లి :** చింతపల్లి నుండి చౌడుపల్లి రహదారి మధ్యన కల్వర్టు కుంగిపోయింది. దీంతో శుక్రవారం ఎంపిపి కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, గూడెం కొత్తవీధి ఎంపిపి బొయిన కుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రహదారి మీదుగా పాడేరు సహా అనేక గ్రామాల ప్రజలు ప్రతిరోజూ ప్రయాణం సాగిస్తున్నారని, బస్సులు, వాహనాలు తరచూ ఈ మార్గంలో తిరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలు, మొంథా తుఫాన్ ప్రభావంతో కల్వర్టు పూర్తిగా కుంగిపోయి ప్రమాదకర స్థితికి చేరిందని పేర్కొన్నారు. భారీ వాహనాల నేపథ్యంలో ఈ కల్వర్టు మీదుగా తిరగవద్దని హెచ్చరిక బోర్డులు ఇంజనీరింగ్ శాఖ ఏర్పాటు చేశారని తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందించి కొత్త కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చౌడుపల్లి సర్పంచ్ లలితాదేవి, కో-ఆప్షన్ సభ్యుడు నాజర్ వల్లీ, ఇంజనీరింగ్ అధికారులు బాలకిషోర్, లోకేష్, వైసిపి నేతలు రాజారావు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న నాయకులు

## ఎ.అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

**ప్రజాశక్తి.చింతపల్లి :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్ శుక్రవారం ఎ.అన్నవరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులు, కేసు పత్రాలు, రిజిస్టర్లు తదితరాలను పరిశీలించారు. పోలీసు సిబ్బందితో పలు అంశాలపై చర్చించి, పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, ప్రజా సేవా కార్యక్రమాల అమలు పట్ల సూచనలు అందించారు.




రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌పి

# తుపాను బాధితులను ఆదుకుంటాం

### ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి

**ప్రజాశక్తి- దేవీపట్నం:** మొంథా తుఫాను వలన నష్టపోయిన అందరినీ ఆదుకుంటామని ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషదేవి హామీ ఇచ్చారు. మండలంలో నష్టపోయిన బాధితులను టిడిపి మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఆమె పర్యవేక్షించారు. పెద్ద భీంపల్లిలో మినుము పంట వేసి నష్టపోయిన రైతుల పొలాలు పరిశీలించి వారికి ధైర్యం చెప్పారు. ఇందుకూరు పేటలో కూడా పంటలు పరిశీలిం చారు. నష్టపోయిన అందరికీ ఎలాంటి తారతమ్యం పరిహారం అందేలా చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పలు స్థానిక సమస్యలు ఆమెకి తెలుపగా పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. సొసైటీ అధ్యక్షులు మాగపు బాబురావు, కూటమి నాయకులు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు శారపు రాయుడు, బిజెపి మండల అధ్యక్షులు కారం తమ్మన్న దొర, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ సాల్మన్‌రాజు, ఎఒ వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

# పోలవరం ముంపు జాబితాలో చేర్చాలి

### పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ కలెక్టర్ అభిషేక్ కిషోర్‌కి వినతి

**ప్రజాశక్తి- వి.ఆర్.పురం:** పోలవరం ప్రాజెక్టు ముంపు జాబితాలో తమ గ్రామాన్ని చేర్చాలని ఎస్సి కాలనీ ప్రజలు కోరుతూ శుక్రవారం పోలవరం ప్రాజెక్ట్ ఆథారిటీ కలెక్టర్ అభిషేక్ కిషోర్‌ను కలిశారు. ఇటీవల భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడును కూడా కలసి తమ ఆవేదన తెలిపారు. కలెక్టర్ అభిషేక్ కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం పోలవరం ముంపు గ్రామాల పరిస్థితిని సమీక్షిస్తోందని, అలాగే ఇంకా మిగిలిన ప్రభావిత గ్రామాల స్థితిగతులపై కూడా పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. రేఖపల్లి ఎస్సి కాలనీ ప్రజల సమస్యలను ఆర్అండ్ ఆర్ కమిషనర్‌కు నివేదించనున్నట్లు చెప్పారు. మండల టిడిపి ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి గోలి సత్తిబాబు మాట్లాడుతూ గ్రామస్తులు పలుమార్లు బ్యాక్‌వాటర్ ప్రభావంవల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. టిడిపి మండల అధ్యక్షుడు బొర్రా నరేష్, మామిడి రాజు కలసిన వారిలో ఉన్నారు.

## సమస్యలపై పిఒకు వినతి

**ప్రజాశక్తి-విఆర్‌పురం:** చింతూరు ఐటిడిఎ పిఒ శుభంనొక్వాల్‌కి టిడిపి నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి మాట్లాడుతూ బ్రిడ్జి లేక ఇబ్బందులు విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నవరం బ్రిడ్జి త్వరిత గతిన నిర్మాణం చేపట్టాలని కోరారు. స్పందించిన పిఒ శుభంనొక్వాల్ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వి ఆర్ పురం మండలం టిడిపి మాజీ మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్ , కూనవరం మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు, కూనవరం మాజీ ప్రధాన కార్యదర్శి పోడియం అప్పారావు, శ్రీరామగిరి దేవస్థానం చైర్మన్ పెందుర్తి సుదర్శన్‌రావు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి బురక కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి రోడ్డు వేయాలి

**ప్రజాశక్తి- చింతూరు:** చింతూరు మండలం, పేగ పంచాయతీ, కొత్తగూంపు (అల్లిగూడెం ) గ్రామంలో అంగన్‌వాడి కేంద్రం రెండు కిలో మీటర్ల దూరంలో ఉండడం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు అంగన్వాడీ సేవలు, పౌష్టికాహారం తీసుకునేందుకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. చింతూరు ప్రాజెక్ట్ అధికారిని గ్రామస్తులు కలిసి సమస్యను వివరించగా పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# డ్రోన్లతో భయపెడుతున్నారు..

- ఎగరేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి
- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్




మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత బాలదేవ్

**ప్రజాశక్తి-అరకులోయ రూరల్:** మండలంలోని తోడంబు వలస, లండిగూడ, అనంతగిరి మండలం వెంగడ, పట్టం ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి డ్రోన్‌లు ఎగురవేయడంతో గిరిజనులు తీవ్ర భయాందోళనకు గురి అవుతున్నారని, కలెక్టర్, ఎస్ పి స్పందించి డ్రోన్ ఎగరేస్తున్న అనుమానిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలోని ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అరకులోయ మండలం లోతేరు పంచాయతీ తోడంబువలస, లండిగూడ, అనంతగిరి మండలం వేంగడ, మెట్టపాడు గద్యవలస, గోమంగిపాడ, డాలింపుట్టు, కొత్తవలస, వాలసి, హుకుంపేట మండలం మజ్జివలస, కుసుమవలస, పట్టాం పంచాయితీ పరిసర ప్రాంతాల్లో డ్రోన్లతో గిరిజనులు తీవ్ర భయభ్రాంతులకు గురి అవుతున్నారన్నారు. ఈ విషయం పాడేరు డీఎస్పీకి ఆధారాలతో పిర్యాదు చేశామన్నారు. ఆదాని, నవయుగ కంపెనీలకు చెందిన అనుమానిత వ్యక్తులు డ్రోన్లు ఎగర వేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

డ్రోన్లు ఎగరవేస్తున్న అనుమానిత వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఫిర్యాదులు చేసినప్పటికీ కనీసం పట్టించుకోలేదన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో సర్వేలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. తమ అడవులు, భూములు పంటపొలాలు ఎట్టి పరిస్థితుల్లో వదులుకోబోమని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా జిల్లా ఎస్పీ స్పందించి డ్రోన్ ఎగరేస్తున్న అనుమానిత వ్యక్తులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి జి బుజ్జిబాబు, నాయకులు రాము,కిల్లో బుజ్జిబాబు, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ బస్కి కన్వీనర్ బురిడీ దశరథ్, జిల్లా కో కన్వీనర్ జగన్నాథం, మగ్గన్న పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగికి ఆత్మీయ సన్మానం



దళపతి దంపతులను సత్కరిస్తున్న ప్రిన్సిపల్, తోటి ఉద్యోగులు

**ప్రజాశక్తి-పెదబయలు :** స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో హాస్టల్ కిచెన్ హెల్పర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన దళపతి సోమ్రా దంపతులను శుక్రవారం సాయంత్రం ప్రిన్సిపాల్ డి.సూర్యశంకర్‌రావు ఉపాధ్యాయ సిబ్బంది, వర్కర్లు సాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. విధుల పట్ల సోమ్రాకున్న అంకితభావాన్ని ప్రిన్సిపాల్ శంకరరావు ప్రశంసించారు. డిప్యూటీ వార్డెన్ సింహాచలం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మూన్నాళ్ళ ముచ్చటే..

- నాలుగు నెలల్లోనే ఛిద్రమైన అంజలి శనివారం గ్రామ రహదారి
- నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ : కొరవడిన అధికారుల పర్యవేక్షణ

**ప్రజాశక్తి-చింతపల్లి :** చింతపల్లి మండలం లోని మారుమూల అంజలి శనివారం పంచాయతీకి వెళ్లే రహదారి పరిస్థితి 'మూడు నాళ్ళ ముచ్చటే' అన్న చందంగా ఉంది. రహదారి నిర్మించి నాలుగు నెలలు కూడా గడవక ముందే రోడ్డంతా ముక్కముక్కలైంది. దశాబ్దాలుగా ఎదురుచూసిన రహదారి కల నెరవేరిందనే గ్రామస్తుల ఆనందం కేవలం నాలుగు నెలల్లోనే మట్టిలో కలిసిపోయింది. అంజలి శనివారం పంచాయతీ ప్రజలతోపాటు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కృషి ఫలితంగా జాజులపాలెం-అంజలి శనివారం మధ్య సుమారు 6 కిలోమీటర్ల రహదారి పనులు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జూలై నెలలో ప్రారంభించి పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణం జరిగిన కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రహదారి పాడైపోవడంతో నాణ్యత ప్రమాణాలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగా రోడ్డు వేసేటప్పుడు బేస్‌మెంట్ సరిగా వేయలేదు. మట్టి, చిన్న రాళ్లతోనే పనులు ముగించారు.



ఛిద్రమైపోయిన అంజలి శనివారం గ్రామ తారురోడ్డు

ప్రజలకు రోడ్డు కనిపిస్తే చాలు అన్న ధోరణితో అధికారులు పనులు పూర్తి చేశారు. వర్షాలు పడగానే రోడ్డు గాలికి ఎగిరిపోయింది. వాహనాలు నడపడం ప్రమాదకరంగా మారిందని తెలిపారు. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, గర్భిణులు, వృద్ధులు, రోగులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణ లోపం**

రహదారి నిర్మాణంపై పర్యవేక్షించాల్సిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పనులపై ఎటువంటి పర్యవేక్షణ చేయలేదని స్థానికులు మండిపడుతున్నారు. కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పూర్తిగా ఉల్లంఘించారు. డాంబరు పొర లేకుండా, తగిన మెటీరియల్ వినియోగం లేకుండా చేసిన పనులు వర్షం రాగానే మట్టిపాలై పోయాయి. ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులు నీటిలో కలిశాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం, అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి తక్షణమే స్పందించి రహదారి నిర్మాణం చేపట్టిన గుత్తేదారుడుపై చర్యలు తీసుకొని, గుంతలు ఏర్పడిన చోట పునర్నిర్మాణ చేయాలని కోరుతున్నారు.

# త్వరితగతిన అర్జీల పరిష్కారం

## జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ : పిజిఆర్ఎస్‌కు 135 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, పిఒ

**ప్రజాశక్తి-పాడేరు టౌన్ :** ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 135 వినతులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, ఇన్చార్జి జెసి, ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ, అసిస్టెంట్ కలెక్టర్ కె సాహిత్, డిఆర్ఒ కె పద్మలత, పాడేరు ఇంచార్జ్ ఆర్ డిఒ ఎస్ విఎస్ లోకేశ్వరరావు సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖాధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు. అంతకుముందు సర్దార్ వల్లబాబాయ్ పటేల్ 150వ జయంత్యుత్సవం సందర్భంగా ఆయన చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

**స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని..**

పెదబయలు మండలం బొంగరం పంచాయతీ దోసలబంద గ్రామస్తులు బి.మాధవరావు, వి.సూరి పడాల్, వి.సత్తిబాబు గ్రామంలో స్కూల్ నిర్మాణం, నీటి సౌకర్యం, రహదారుల నిర్మాణం గురించి అర్జీ పెట్టారు. డుంబ్రిగూడ మండలం పోతంగి పంచాయతీ లివిటిపుట్టుకు చెందిన ఎస్.గణేష్, టి.కొండబాబు, జి.అప్పలస్వామి గ్రామంలో స్కూల్ భవన నిర్మాణం పూర్తిచేయాలని దరఖాస్తు చేశారు. హుకుంపేట మండలం ఓల్డా పంచాయితీ పోసలగరువు పీసా కమిటీ కార్యదర్శి బి.బొంజుబాబు చెక్ డ్యామ్‌ల మరమ్మత్తులకు నిధులు మంజూరుకు అర్జీ పెట్టారు. కొయ్యూరు మండలం మర్రివాడ పంచాయితీ గుడ్లవల్లికి చెందిన ఎన్.పెద్దబ్బాయి, ఎన్.వెంకటరావు, కె.రాజబాబు నూతన అంగన్వాడీ భవన నిర్మాణం మంజూరుకు వినతి అందించారు.చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ బౌర్తి గ్రామస్తులు ఎస్.నాగేశ్వరరావు, ఎన్.స్వామి, కె.బాబ్జీ గ్రామంలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ధరఖాస్తు పెట్టారు. జి.మాడుగుల మండలం పాలమామిడి గ్రామానికి చెందిన పి.భాస్కరరావు, కె.భద్రా, పి.అంజిబాబు కమ్యూనిటీ భవన నిర్మాణం గురించి ధరఖాస్తు చేసారు. డుంబ్రిగుడ మండలం కుతలంగి పంచాయితీ పరిశీల గ్రామ సర్పంచ్ సుబ్బారావు గ్రామంలో కల్వర్టులు, ఇళ్లు నిర్మాణాలు, రోడ్ల మరమ్మత్తులు, చెక్ డ్యామ్ ల నిర్మాణాలపై విన్నవించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యు డిడి పిబికె పరిమళ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, డిఆర్ డిఎ పిడి వి.మురళీ, ఆర్అండ్ బి ఇఇ బాల సుందరబాబు, గ్రామ వార్డ్ సచివాలయ నోడల్ ఆఫీసర్ పిఎస్ కుమార్, డిపిఒ కెపి చంద్రశేఖర్, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు , డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎ.జయప్రకాష్, జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వి రమణారావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.ప్రసాద్ ఉన్నారు.

# తుపాన్ బాధితులకు నిత్యావసరాలు



సరుకులు అందజేస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

**ప్రజాశక్తి - అనంతగిరి:** మొంథా తుఫాన్ బాధితులకు స్థానిక జెడ్పిటిసి, తహాసిల్దార్ చేతుల మీదుగా నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టారు. కోనపురం పంచాయితీ వంటలమామిడి, సప్పడి. గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు జెడ్పిటిసి గంగరాజు, తహసిల్దార్ ఎం.వీరభద్రచారిలు మాట్లాడుతూ, సప్పడి, వంటల మామిడిలో ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, కందిపప్పు ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేసామని తెలిపారు. ఒక కుటుంబానికి మూడు వేల ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ గ్రామాలకు శాశ్వత మోడల్ కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో బొర్రా సర్పంచ్ జన్ని. అప్పారావు, జనసేన మండల నాయకులు సిహెచ్. మురళి, టిడిపి మండల నాయకులు టి. ఆనంద్, వైసిపి నాయకులు రఘునాథ్, .నవీన్. వీఆర్ఒ. విజయమణి. పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

**హుకుంపేట:** మండలంలోని గడికించుమండ సచివాలయ పరిధిలో మెంథా తుఫాన్ ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సహాయక సరుకుల కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ . చంద్రశేఖర్, తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో టి. రమాదేవి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో, ఆర్ఐ, పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, వీఆర్ఏలు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరులకు ఘన నివాళి

**ప్రజాశక్తి-అరకులోయ:** పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అరకులోయ ఎస్సై గోపాలరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి అరకు టౌన్షిప్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వరకు క్యాండిల్ ర్యాలీ కొనసాగించి మానవహారం నిర్వహించారు.



అరకులో ర్యాలీ చేస్తున్న పోలీసులు

**ముంచింగి పుట్టు** : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుండి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల వరకు ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో అమర వీరుల సంస్మరణ యూనిటీ రన్ చేపట్టారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

**చింతపల్లి :** సమాజ మార్పు కోసం, ప్రజల భద్రత కోసం పోలీసు అమరవీరుల త్యాగాలు అపారమని చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం చింతపల్లి మండల కేంద్రంలో పోలీసులు ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు.



కొవ్వొత్తుల ర్యాలీలో పోలీసులు

ఉదయం అమరవీరుల స్ఫూర్తితో వాక్ అండ్ రన్ ర్యాలీ నిర్వహించగా, సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీతో వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా మాట్లాడుతూ సేవలో ప్రాణత్యాగం చేసిన ప్రతి పోలీసు అధికారి మనందరికీ ఆదర్శమని, వారి త్యాగం వల్లనే ప్రజలు నిశ్చింతగా జీవిస్తున్నారని తెలిపారు. వారి కుటుంబాలను ప్రభుత్వం ఎల్లప్పుడూ ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో సీఐ వినోద్‌బాబు, ఎస్సైలు వెంకటేశ్వరరావు, వెంకటరమణ, స్థానిక పోలీస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్, ఏపీఎస్పీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

**ప్రజాశక్తి -సీలేరు:** అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగి నుంచి సీలేరు వరకూ పర్యాటకంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాలని జిల్లా కాంగ్రెస్ (డిసిసి) కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆయన స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పర్యాటకంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్నప్పటికీ అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. వెనుకబడిన చింతపల్లిగూడెం కొత్తవీధి కొయ్యూరు వైరాంబరం మండలాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే అభివద్ధి చెందుతుందన్నారు.కాంగ్రెస్ హయాంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలో ఉన్న సమయంలో అప్పటి కేంద్రమంత్రిగా చిరంజీవి లంబసింగి నుంచి సీలేరు వరకూ పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించా రని ప్రతిపాదనలో నేటికీ అమలు కాలేదన్నారు. గూడెం మండలం పరిధిలో సప్పర్ల దారకొండ సీలేరు పొల్లూరు తదితర ప్రాంతాల్లో జలపాతాలు, జల విద్యుత్ కేంద్రాలు అనుభూతులు కలిగించే మరెన్నో ప్రదేశాలు ఉన్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ఈ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు.



నిత్యావసరాలు అందిస్తున్న సర్పంచ్ బుజ్జిబాబు

# తుపాను బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

**ప్రజాశక్తి -సీలేరు:** మొంథా తుఫాన్ బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు దారకొండ, సప్పర్ల సివిల్ సప్లై రేషన్ డిపోలలో ఏర్పాట్లు చేశామని జికె వీధి తహశీల్దార్ అన్నాజీరావు పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గాలికొండ పంచాయతీ చట్రాపల్లి దారకొండ పంచాయతీ తోకరాయి గ్రామస్తులకు సివిల్ సప్లై డీలర్లచే సరుకులు పంపిణీ చేశామన్నారు. తోకరాయిలో 61 కుటుంబాలకు, చట్రాపల్లిలో 37 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, ఒక కేజీ చొప్పున పప్పు వంటనూనె బంగాళదుంపలు ఉల్లిపాయలు తదితర సామాగ్రి బాధితులకు అందజేశామని తెలిపారు. నగదును వారి వారి అకౌంట్లో జమ చేస్తామని తెలిపారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

# 104 సంచార వైద్య శిబిరం

**ప్రజాశక్తి - గంగవరం:** గంగవరం మండలం ఆముదాలబంద, రాజంపాలెం గ్రామంలో 104 సంచార చికిత్స కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్వేత మాట్లాడుతూ 73 ఒపి వచ్చిందని, అందులో 35 మంది బిపి , 40 మంది షుగర్ పేషెంట్స్ 10మంది జ్వరాలు ఇతర వ్యాధులతో వచ్చారన్నారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం కూడా నిర్వహించారు.

# దేశపౌరుల ఐక్యతను చాటిచెప్పాలి

**ప్రజాశక్తి -పాడేరు :** భారతదేశం పౌరుల ఐక్యతను ప్రపంచానికి చాటిచెప్పాలని, అదే ఏక్తా రన్ ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్‌కుమార్ అన్నారు.సర్దార్ వల్లభ భాయి పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం రాష్ట్రీయ ఏక్తా రన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అమిత్ బర్దార్, ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ, సహాయ కలెక్టర్ సాహిత్, డిఎస్పి ఎస్.కె. షహబాజ్ అహ్మద్ పాల్గొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు.పటేల్ చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి కే పద్మలత పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

**జి మాడుగుల:** పటేల్ జయంతి పురస్కరించుకొని జిమాడుగుల పోలీసుల ఆధ్వర్యంలో యూనిటీ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాసరావు, ఎస్సై షణ్ముఖరావు, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినయ్ గన్ పాల్గొన్నారు.

**చింతూరు:** ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని చింతూరు సిఐ గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఐక్యతా దినోత్సవం సందర్భంగా శుక్రవారం చింతూరులో 2కె రన్ నిర్వహించారు. ఎస్సై రమేష్, సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యతాదినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అంతా కులమతాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

**అడ్డతీగల:** స్థానిక మండల కేంద్రంలో సీతపల్లి సెంటర్ నుండి భీముడుపాకల వరకూ సిఐ నరసింహమూర్తి 2 కె రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ వినోద్ పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు



పాడేరు: మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**సీలేరు:** జికె వీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్లో శుక్రవారం ఎస్ఐ యాసీన్ ఆధ్వర్యంలో సిఆర్‌పిఎఫ్, సివిల్ పోలీసులు యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగాసనాలు వేశారు.

**రంపచోడవరం :** పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 2కె రన్, మానవహారం నిర్వహించారు. డిఎస్పి సాయిప్రశాంత్ శుక్రవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులమత భేదాలు లేకుండా ఐక్యతతో ఉండాలనే ఉద్దేశంతో నిర్వహించుకునేదే ఐక్యతాదినోత్సవం అన్నారు. అంబేద్కర్ సెంటర్‌లో మనవహారం నిర్వహించారు. శనివారం రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఐ సన్యాసి నాయుడు, ఎస్సైలు వెంకట్రావు, భూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

**రాజవొమ్మంగి:** ప్రజలంతా కులమతాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని రాజవొమ్మంగి సిఐ గౌరీశంకర్ అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రాజవొమ్మంగి, జడ్డంగి గ్రామాల్లో 2కే రన్ నిర్వహించారు.

# ఇక్కడ కూలిపోయింది.. అక్కడ పూర్తవలేదు



గొర్రెలమెట్టలో కూలిపోయిన స్కూల్ భవనం

**ప్రజాశక్తి - కొయ్యూరు :** మండలంలోని బూదరాళ్ల పంచాయతీ గొర్రెల మెట్ట గ్రామంలో గత ఆరు నెలలుగా స్కూలు భవనం కూలిపోయి ఉన్నా అధికారులు పాలకులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. గొర్రెల మెట్ట గ్రామంలో స్కూల్ భవనం కూలిపోయి సుమారు ఆరు నెలలు దాటిందని గ్రామంలో ఉన్న ఒక చర్చిలో విధులు నిర్వహిస్తున్నారని అక్కడ నుండి వారు బయటికి వెళ్ళమంటే ఎక్కడికెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సుమారు 40 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. భవనం బాగుచేయాలని పలువురు కోరుతున్నారు. ఎంఇఒని వివరణ కోరగా పై అధికారులకు తెలిపామని చెప్పారు.



మర్రిపాలెం వద్ద పూర్తికాని డిగ్రీకళాశాల భవనం

**నిలిచిపోయిన భవనం పూర్తయ్యేనా..?**

మండలంలోని డౌన్నూరు పంచాయతీ లోని డౌనూరు ఆశ్రమ పాఠశాల, మర్రిపాలెం వద్ద ఉన్న డిగ్రీ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. డౌనూరు ఆశ్రమ పాఠశాలలో మధ్యలోనే నిలిచిపోయిన హాస్టల్ భవనాన్ని నిర్మించాలని, నిరుపయోగంగా ఉన్న సోలార్ ప్లాంట్ బాగు చేయించాలని కోరుతున్నారు. మర్రిపాలెం డిగ్రీ కళాశాలలో విద్యార్థులు వాష్ రూమ్‌లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి నివాళి

**ప్రజాశక్తి-చింతూరు:** దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్థంతి శుక్రవారం చింతూరులో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అక్బర్, ఎండి జోహార్ నరేష్, ఐఎన్‌టియుసి కన్నయ్య వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

**విఆర్‌పురం:** దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు లీలా కృష్ణ నాగేంద్ర ప్రసాద్ ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో కుంజ రమేష్, మడకం జానయ్య పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**ప్రజాశక్తి - జికె వీధి :** మండలంలో మొంథా తుఫాను కారణంగా ఇళు పంటలు కోల్పోయిన వారికి నష్టపరిహారం త్వరగా వచ్చేలా కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి మండల కార్యదర్శి, వైసిపి సోషల్ మీడియా అధ్యక్షులు పాతున లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రింతాడ, పెదవలస గ్రామాల్లో రైతులకు నష్టపరిహారం వచ్చేలా నాయకులు దృష్టి సారించాలన్నారు.

# కొండచరియల వద్ద హెచ్చరిక బోర్డు

**ప్రజాశక్తి - కొయ్యూరు :** కొయ్యూరు మండలం డౌనూరు మీదుగా చింతపల్లి వైపు వెళ్లే రహదారి మార్గంలో లంబసింగి ఘాటీ వద్ద కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న చోట ప్రజలకు తెలియజేసేందుకు కొయ్యూరు పోలీసులు హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో వాహనాలు జాగ్రత్తగా నడపాలని, నెమ్మదిగా వెళ్ళాలని, కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున అక్కడ ఆగవద్దు అని ఫ్లెక్సీ ద్వారా తెలియజేశారు. కొయ్యూరు మంప పోలీసులు పాల్గొన్నారు.




పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

# పారిశుధ్య పనులు

**ప్రజాశక్తి - రంపచోడవరం :** మండలంలోని తామరపల్లి పంచాయతీ పరిధిలోని కన్నవారం గ్రామంలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ముసురమిల్లి ఎంపిటిసి సభ్యులు వంశి కుంజం పాల్గొన్నారు. గ్రామంలో బ్లీచింగ్ వేయించడంతో పాటు యాంటీ లార్వా మందులను పిచికారీ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంకుడు గుంతలు పనులు తిరిగి ప్రారంభించేలా చూడాలని ఫీల్డ్‌అసిస్టెంట్‌కు సూచించారు. పాఠశాలను సందర్శించి విద్యాభ్యాసం, భోజనం నాణ్యతను పరిశీలించారు. అదనపు క్లాస్‌రూమ్ మంజూరుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం పద్మసుహాసిని, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామసీత,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు

## - కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమీక్ష

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్** నవంబర్ 14, 15వ తేదీల్లో విశాఖపట్టణం వేదికగా జరిగే ప్రపంచ స్థాయి భాగస్వామ్యసదస్సు విజయవంతమయ్యేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి 3 వేల మంది అతిథులు విచ్చేస్తున్నారని, అంబాసిడర్లు, కాన్సులేటర్లు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులు అందులో ఉంటారన్నారు. ఎయు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సదస్సు జరుగుతుందని, ఇప్పటి నుంచే అధికారులు వేదిక వద్దకు వెళ్లి చేయాల్సిన పనులపై అవగాహన పెంచుకోవాలని, సిఐఐ అధికారులతో సమ్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో సమావేశంలో పాల్గొన్నారు. రోడ్లు బాగుచేయాలని, నగర సుందరీకరణ, పర్యాటక ప్రాంతాలు, ఆలయాల వద్ద ఆతిథ్య కార్యక్రమాలకు పక్కా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎయు ఇంజనీరింగ్ కళాశాల మైదానం పైభాగంలో హెలీప్యాడ్‌లు సిద్ధం చేయాలని, అక్కడ నుంచి ప్రధాన వేదిక వద్దకు చేరుకునే మార్గాలను వేయాలని, ఇతర ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి రెండు రోజుల పాటు సదస్సు వద్దే ఉంటారని దానికి తగ్గట్టుగా అధికారులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఉంటుందని,అక్కడ నుంచే అన్ని సహాయ, సహకారాలు అందుతాయని తెలిపారు.

# బీచ్ రోడ్డులో మాయావరల్డ్ ప్రారంభం

**ప్రజాశక్తి- ఎంవిపికాలనీ:** విశాఖ సాగరతీరంలో టియు-142 ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మాయా వరల్డ్‌ను విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ప్రారంభించారు. శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన తదుపరి ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా విశాఖలో ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన 'ఇమాజిన్ రూమ్స్' తరహాలో రూపొందించిన ఈ మ్యూజియం ఆకట్టుకుంటోందన్నారు.